అయితే కాకాసురుడని ఒక రాక్షసుడుండేవాడు. వాడు పరమ స్కవుండ్రల్. ఓసారి సీతా అమ్మవారిని లోకమాతను కాకిరూపంలో వచ్చి వక్షస్థలం మీద కొరికాడు. జగన్మాత వాడికి కూడా తల్లే నన్న ఇంగితం వాడికి లేదు. పాపిష్ఠి వెధవ! అప్పుడు శ్రీరామ చంద్రులవారు రామ బాణాన్ని సంధించి వేశారు. అయ్యా ఇక చూస్కోండి ముందు కాకాసురుడు, వెనుక రాంబాణమూను. ముల్లోకాలూ తిరిగాడు. బంగళాదేశ్ వెళ్ళాడు. శ్రీ లంక వెళ్ళాడు. పాకీస్తానం వెళ్ళాడు. ఎక్కడకు వెళ్ళినా రాంబాణానికి తిరుగులేదు. మేం ఇంటర్ ఫియర్ కాం అన్నవారే – కాకాసురుడు చేసేది లేక, రావుల్ తప్పి 'ఇప్పుడు నేనేంచెయ్యాలి. రాంబాణం దెబ్బకు చావకుండా బతకాలంటే' అని తెలుగుదేశం వాళ్ళు చంద్రబాబు నాయుణ్ణి అడిగినట్టు అడిగాడు. అప్పుడు నారదుడో మరెవరో రుషి చిరునవ్వు నవ్వి – 'నువ్వెళ్ళి సీతమ్మ మాయమ్మ అని అమ్మవారి కాళ్ళమీద పడి శరణు శరణు తల్లీ' అని వేడుకోపొమ్మని పాయింట్ చెప్పారు. అప్పుడు కాకాసురుడు వెళ్ళి తల్లి కాళ్ళమీద పడ్డాడు కావవే బ్రోవవే జగన్మాతా అంటూ. పోన్లెండి కాకి వెధవ మీదా మీ ప్రతాపం – వాడ్నేమీ అనకండి అని శరణు ఇచ్చింది. (మా చిన్నప్పుడు మగ పిల్లలు ఆటల్లో శరణురా శరణు అని కుర్రాళ్ళల్లో కాస్త రవుడీల్లాటి పెర్సనాలిటీల్ను చూసి శరణడిగినవాడి వెనక్కాల దాక్కుంటూ – ఆ వచ్చిన వాడి చేత తినవలసి తన్నులన్నీ ఈ శరణిచ్చిన వాడు తినేవాడు) అప్పుడు శ్రీ రామచంద్రులు అన్నారు గదా –

నాది రాంబాణం వదిలితే దేన్నో ఓ దాన్ని కొట్టకుండా తిరిగిరాదు. దీన్ని విత్ డ్రా చేయడానికి నాక్కూడా పవర్స్ లేవు పొమ్మన్నాడు.

అప్పుడు కాకాసురుడే నాకు రెండు కళ్ళున్నాయి. చేసిన వెధవ పని ఎలాగూ చేశాను. నా కన్ను మీద కొట్టమని రాంబాణానికి సరెండరయ్యాడు. ఆ విధంగా కాకికి ఒక కన్ను కాస్తాపోయింది.

అమ్మ ఔదార్యం అమ్మదే –

# సంగీత సరస్వతి

**సం**గీతం ఎక్కడ వుంది అని అడిగే వారికి జవాబు సంగీతం ఎక్కడలేదు అని అడిగితే సరిపోతుంది.

చెట్లకొమ్మల సందుల నుంచి, ఆకుల్ని గలగలమనిపిస్తూ రివ్వున వీచే గాలి చేసే చప్పళ్ళలో ఎన్ని మార్దవాలున్నాయి?

టపటపమని వాన చినుకులు ఆకాశం నుంచి బయల్దేరి భూదేవిని ముద్దాడే లోపల ఎన్ని ధ్వనులు ఎన్ని వింతల్ని సృష్టిస్తాయి?

నూతిలోకి దబ్బున చేదను విసిరినపుడు ఆ నూతిలోని గిలగిలలు, వెలుగు నీడల దోబూచులు – ఆ మిలమిలలు ఏమని చెబుతాయి?

నూతిలోని చందమామను ఏ బాల్చీ పైకి తోడగలదు?

కాలవ గట్ల వద్ద మాసిన బట్టల మోపులను లేయెండలో వీపుల మీద ముత్యాల బిందువులై స్వేదం లోంచి ఇంద్రధనుసులు చిమ్మగా 'ఉస్సు రుస్సు' అంటూ బండలను బట్టలతో బాదే వేళల – ఆ కష్ట చప్పుళ్ళలోంచి శ్రమైకజీవన సౌందర్యమే గాక శ్రమైక జీవన సంగీతం కూడా వినిపించడం లేదా?

"సువ్వి సువ్వి" అనేగాక స్త్రీలు రోకళ్ళతో దంచుతూ పాడే పాటల్లో లయ, వూగుతూగు ఎవర్ని ఆకర్షిస్తున్నట్లు?

ఆవుల అంబారావాలు, మేకల మేమేలు, పిచికల కిచ కిచలు, పావురాళ్ళ కువకువలు శునకాల భౌభౌలు, కోళ్ళ కొక్కొరొకోలు, గుర్రాల సకిలింపులు యివి రోజూ విన్నా మనిషికి యీ సంగీతం అంతా ఎక్కడి నుంచి వస్తోందో – యీ గోలల్లో యీ అరుపుల్లో ఆకలి కోపం భయం, ఆందోళన సంతోషం, ఎన్ని లేవు?

గోడకు మేకు కొట్టినా, గోడను పడగొట్టినా, రాళ్ళను బద్దలు కొట్టినా, మరలు తిరిగినా, పొగ గొట్టం ఘూంకారం చేసినా, టైపు మిషనుమీద వ్రేళ్ళు టిప్ టిప్ మని పించినా, సైకిలు చక్రం గిర్రున తిరిగినా రైలింజను 'కూ' అన్నా, ఆటో బరబరమనినా, జటకాబండి టకటక మనినా కారు 'హారన్' పప్పాయి ఆపం పాం – వప్పాయి పాం అన్నా యీ ధ్వనులన్నీ ఏ సృష్టి విలాసాన్ని కీర్తిస్తాయి?

కూర వేగుతున్నప్పుడు పప్పు వుడుకుతున్నప్పుడు అట్టు తిరగేసినప్పుడు పోపు చారులోకి గెరిటతో దింపినప్పుడు సుంయి సుంయిలు, చుర చురలు నీటిమీద నూనె, నూనెమీద నీరుపడినపుడు అవి పరస్పరం ఏమి మాట్లాడుకుంటాయో యెవరికి తెలుసు?

పంపులోంచి నీరు బాల్చీలోకి వురుకుతున్నప్పుడు "ఛష్" మని ఆవేశంతో గొట్టంలోంచి నీరు చేసే చప్పుడు – బంధనాల్లోంచి బయటపడ్డానికి అదిపడే తాపత్రయాన్ని ఎవరు కొలవగలరు?

అడుగులు ఎన్నిరకాలు? అడుగుల చప్పుళ్ళు ఎన్నిరకములు? పందెంలో పరి గెత్తేవాడి అడుగులూ పారిపోయేవాడి అడుగులు, దొంగ అడుగులు, దొరల అడుగులు, తప్పటడుగులు వేసే పాపాయి చిన్నారి పొన్నారి చిట్టీపొట్టీ అడుగులు, ప్రేయసి అడుగులు, పెళ్ళాం పోపుమాడి పోతున్నపుడు వేసే పరిగెత్తే అడుగులు, జేబు దొంగ అడుగులు. సిటీబస్సందుకుందుకువేసే వడివడి నడకల అడుగులు, పెద్ద వారితో అడుగులో అడుగుగా వేసే అడుగులు, నాయకుని అడుగుజాడల్లో వేసే అడుగులు ఎన్నెన్ని చిత్రవిచిత్రాలైన అడుగులు? రేడియోవాడు చెప్పినట్లు ఈ ప్రపంచం అంతా సౌండు మీడియావేఁ.

రాయి మీద రాయిపడితే, రెండు రాళ్ళు ఢీకొంటే, రాళ్ళన్నీ దడదడామని లారీలోంచి క్రిందకు జారితే అవి మూలస్వరూపాన్ని మార్చుకుని భూమాత ఒడిలోకి జారినందుకు గోల చేస్తున్నాయా?

చెట్టు పడిపోయినప్పుడు మీకు కలిగే దుఃఖం ఓ కంపెనీ పడిపోయినప్పుడు కలిగే దుఃఖం కంటే ఎక్కువ కాదా?

మీకు తెలుసోలేదో సృష్టిలో బేలన్సింగ్ (సమతూకం) వుందిగానీ లాభనష్టాల పట్టీలేదు. ప్రకృతిలో ట్రయల్ బేలన్సుంది.

మనం మురళి. ఫిడేలు, వీణ, హార్మనీ, సితార, మృదంగం, తబల క్లారినెట్, తంబూర, మౌత్ ఆర్గన్, యింకా ఎన్నో రకాల వాయిద్యాలుచేసేసంగీత ధ్వనులను కర్ణపేయంగా ఆలకిస్తాము. ఆలోచిస్తే యీ ధ్వనులన్నీ ఎక్కడ దాక్కొని వున్నాయి? ఇవన్నీ ఎక్కడినుంచి పుట్టుకొస్తున్నాయి. ఈ పాడిన పాటలు, ఈ సంగీతాలు, ఈ కచేరీలు అయాక ఎక్కడో ఓక్కడ దాక్కోవాలికదా? పాట కచ్చేరీలు సోలో కచ్చేరీలు యీ అనంత విశ్వంలో గాలిలో కలిసిపోయివుంటాయా? వీటి జమాఖర్చులూ, లాభనష్టాలూ ఎవరు చూస్తారు?

ధ్వని లేనిచోటు, అంతా కాంతి తప్ప మరింకేమీ లేనిచోటు అనేది వుంటుందా? లేక అంతయూ యింతకీ నాన్సెన్సేనా?

సృష్టిలో ధ్వనుల్ని నిబద్ధం చేయడం సంగీతశాస్త్రమా? ఓం కారంలోంచి అంతా వచ్చిందని మనవాళ్ళు దబాయిస్తారు. ఓం కారంలోంచి కాక యిప్పుడన్నీ అహంకారం లోంచివచ్చాయని నా కనిపిస్తోవుంటుంది.

నిద్రపోతున్న మృదంగాన్ని, పెట్టెల్లో దాక్కున్న హార్మణీ, ఫిడేలు వీణల్ను చూస్తే మీకేమనిపిస్తుంది?

ఇవన్నీ తీగలూ చెక్కలూ లక్కలూ అంతేగా - మరి మనం మాత్రం - నిమిత్త మాత్రులం - మరియిందులోంచి యీ సృష్టి విలాసాన్ని గానం చేస్తూ యిన్ని విద్యలు ఎక్కడ్నుంచి వచ్చాయి - భగవంతుని నోట్లోంచా - మానవుని శ్రమ శక్తిలోంచా? బాబోయ్ కారల్ మార్క్స్ బాబాయి గారు చెప్పిందే రైటు ఆలోచించండి;

# 'జవానీ కి రైల్'

వసంతాలు మళ్ళీ మళ్ళీ వస్తూ వుంటాయి. కోయిల్లు కూస్తుంటాయి. అవే మావిచిగుళ్ళు, అవే మందమలయానిలాలు - అదే సెలయేటి గానం - మనకి ఎప్పటికప్పుడు కొత్తగా అనిపించేవన్నీ పాతవే... చంటి పిల్లల బోసి నవ్వులు, చిన్నపిల్లల గంతులూ, అల్లరీ, ఆటలూ - చూసినవీ, విన్నవీ ఎందుకు మనకింత హుషారిచ్చి ఆనందాల్ని కలిగిస్తాయ్? మల్లెపూల